
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
సోమవారం 22 జనవరి 2024

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం 8లో..
సూరమ్మ చెరువుపై చిగురిస్తున్న ఆశలు..! 8లో..

ఇంటర్ విద్యలో ప్రాక్టికల్స్‌కు నిధుల కొరత

- నాలుగేళ్లుగా మంజూరు కాని డబ్బులు
- ల్యాబ్‌లో కానరాని పరికరాలు, రసాయనాలు
- జూనియర్ కళాశాలలు, కేజీబీవీల్లో అరకొర సౌకర్యాలతో హాజరు
- ఫిబ్రవరి ఒకటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

జగిత్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్ నిర్వహణకు నిధుల కొరత ఏర్పడుతోంది. సుమారు నాలుగు సంవత్సరాలుగా ఇంటర్ విద్యలో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ల్యాబ్‌లలో అవసరమైన నిధులు మంజూరు కాకపోవడం శాపంగా మారుతోంది. దీంతో విద్యార్థులలో నైపుణ్యాలను ప్రదర్శించే ప్రాక్టికల్స్‌ను తూతూ మంత్రంగా కానిచ్చేస్తున్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి నిర్వహించడానికి బోర్డు అధికారులు సిద్ధమవుతున్నారు. అంతకు ముందే విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలకు సిద్ధం చేసే విధంగా బోధన చేయాల్సి ఉంటుంది. నిధుల కొరత కారణంగా అధ్యాపకులు ల్యాబ్‌లో ప్రయోగాలు చేయించలేని పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఏడు కెజీబీవీలు, అయిదు మైనార్టీ గురుకుల కళాశాలలు, అయిదు గురుకుల కళాశాలలు, నాలుగు సోషల్ వెల్ఫేర్ కళాశాలలు నిర్వహిస్తున్నారు. వీటిల్లో సుమారు 3,400 మంది పైగా ఇంటర్ సెకండియర్ విద్యార్థులున్నారు.

● ల్యాబ్స్‌లలో అసౌకర్యాలతో ప్రయోగాలకు దూరం...

ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ల్యాబ్‌లలో సరైన వసతులు లేని పరిస్థితి ఏర్పడింది. ప్రాక్టికల్స్ హాజరయ్యే విద్యార్థులు కొన్ని రోజుల పాటు సిలబస్‌లోని ప్రతి అంశాన్ని ప్రాక్టికల్ చేయాల్సి ఉంటుంది. కానీ ల్యాబ్స్‌లలో పూర్తి స్థాయి వసతులు లేకపోవడంతో విద్యార్థులు ప్రయోగాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో పాటు ఆరేళ్లుగా ప్రభుత్వం సాధారణ కేజీబీవీలను ఇంటర్‌కు అప్‌గ్రేడ్ చేసింది. ఇలా చేసిన చాలా కేజీబీవీల్లో ల్యాబ్‌లు సక్రమంగా లేవు. ల్యాబ్స్‌లలో వసతులు లేకపోవడంతో ప్రయోగాలు చేయలేకపోతున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రాక్టికల్స్ పరీక్షలు ఎలా రాయాలని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● ల్యాబ్‌లో రసాయనాలు, సామగ్రి కొరత...

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గల ప్రభుత్వ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్ తరగతులు లేక అభ్యసనకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ల్యాబ్‌లలో అవసరమైన కెమికల్స్, సామగ్రి ఉండడం లేదు. ప్రధానంగా హైడ్రోక్లోరిక్ ఆమ్లం, సల్ఫ్యూరిక్ ఆమ్లం, నత్రికామ్లం వంటి కెమికల్స్, బ్యూరెట్, పిపెట్, కొనికల్ ఫ్లాస్క్ వంటి పరికరాలు లేకపోవడంతో తరగతుల నిర్వహణకు ఆటంకం ఏర్పడుతోంది. కొన్ని కళాశాలల్లో కాలం చెల్లిన కెమికల్స్ ఉండగా, మరికొన్ని కళాశాలల్లో అవి కూడా ఉండడం లేదు. జీవశాస్త్ర విద్యార్థులకు అవసరమైన క్రోమటోగ్రఫీలోని ఎసిటోన్, ఇథైల్ ఆల్కహాల్, ఫినాఫ్తలిన్, పెట్రోలియం, ఈథర్ వంటివి లేవు.



జగిత్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

● నాలుగేళ్లుగా అవస్థలు..

ఇంటర్ విద్యలో సైన్స్ విద్యార్థులకు థియరితో పాటు ప్రాక్టికల్స్ చాలా కీలకంగా ఉంటాయి. చదువుకున్న పాఠ్యాంశాన్ని ప్రాక్టికల్‌గా నిరూపించాల్సి ఉంటుంది. అయితే ఇందుకు అవసరమైన నిధులను మంజూరు చేయడంలో ప్రభుత్వం ఆరేళ్లుగా జాప్యం వహిస్తోంది. 2014 సంవత్సరానికి ముందు సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు ప్రత్యేక ఫీజు వసూలు చేసి అవసరమైన పరికరాలు, రసాయనాలు కొనేవారు. 2015లో అప్పటి ప్రభుత్వం ఉచిత విద్య అందిస్తామని ప్రకటించడంతో అన్ని రకాల ఫీజుల వసూలును నిలిపివేశారు. తదుపరి కరోనా కారణంగా నిధుల విడుదల జరగలేదు. 2018-19 సంవత్సరంలో చివరి సారిగా ప్రభుత్వం ల్యాబ్‌ల నిర్వహణకు నిధులు విడుదల చేసింది. కళాశాలల్లో సైన్స్ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బడ్జెట్ మంజూరు జరిగింది. తదుపరి నిధులు విడుదల కాకపోవడం, కళాశాల అంతర్గత నిధుల నుంచి కొనుగోలు చేసే అవకాశం ఇవ్వకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. విద్యార్థులకు ప్రాక్టికల్స్‌లో కనీస పరిజ్ఞానం అందించడానికి కొన్ని కళాశాలల్లో అధ్యాపకులు చొరవ చూపి తరగతులు నిర్వహిస్తే మినహా సక్రమంగా కొనసాగే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో విద్యార్థులు ప్రాక్టికల్స్‌లో వెనుకబడి మార్కులు కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది.

ల్యాబ్స్‌లలో పరికరాలు, కెమికల్స్ అందుబాటులో లేవు

సిద్దువినయ్, ఇంటర్ విద్యార్థి, ఏబీవీపీ పట్టణ కార్యదర్శి, జగిత్యాల



జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌లలో సైన్స్ విద్యార్థులకు అవసరమైన ల్యాబ్స్‌లలో కెమికల్స్, పరికరాలు అందుబాటులో ఉండడం లేదు. పలు కళాశాలల్లో కాలం చెల్లిన కెమికల్స్ ఉంటున్నాయి. దీంతో విద్యార్థులు ప్రయోగాలకు దూరం అవుతున్నారు. ఫలితాలపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

నారాయణ, జిల్లా ఇంటర్ విద్యాధికారి



జగిత్యాల జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో ల్యాబ్ కెమికల్స్, ఇతర మెటీరియల్స్ కొనుగోలుకు ఇబ్బందులు ఉన్నాయని ఇంటర్ విద్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము. అక్కడ నిర్ణయం జరిగితే వాటిని సరఫరా చేసే అవకాశాలున్నాయి. ప్రభుత్వం గతంలో ప్రాక్టికల్స్‌కు సంబంధించిన కెమికల్స్, పరికరాల నిర్వహణకు నిధులు మంజూరు చేసింది. కొన్నేళ్లుగా నిధులు లేమి వల్ల నిలిచిపోయింది. సాధ్యమైనంత తొందరలో సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తాను.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

రాయికల్, జనవరి 21: రాయికల్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆహ్లాదంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిలుకమర్రి మదన్ మోహన్, శ్రీగద్దె గంగాధర్, కన్నవేని రాజేందర్‌రెడ్డి, పారిపెల్లి మహేష్, శ్రీధర్, మనోహర్, గణేష్, ఎక్సైజ్ ఎస్సై శిరీషా, పవన్ ఐలయ్య, లలిత, సురేందర్, భూమయ్య, రాము, రమేష్, ప్రకాశ్ గౌడ్, పద్మ, లక్ష్మి, రాజేశం పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డుతో తీవ్రంగా నష్టపోతాం

ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామికి వినతి పత్రం అందజేత



చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 21 : వ్యవసాయంపై ఆధారపడి ఉన్న రైతుల భూములను బైపాస్ రోడ్డు కోసం తీసుకుంటే తీవ్రంగా నష్టం పోతామని మండలంలోని రైతులు ఆవేదనతో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికు సమస్యను తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణరావులకు మండలంలోని వెల్లుల్ల, బండలింగాపూర్, మేడిపల్లి గ్రామాలకు చెందిన రైతులు వినతి పత్రం అందజేసి సమస్యను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూములను నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న రైతులము విలువైన భూములను ఇవ్వమని గతంలోనే చెప్పామని రైతులు పేర్కొన్నారు. రహదారి కోసం భూములు తీసుకుంటే ఉన్న జీవనోపాధి కోల్పోయి పని లేక కుటుంబాలు రోడ్డు పాలవుతాయన్నారు. గ్రామాల మధ్య ఉన్న భూములకు గజానికి సుమారు రూ. 10 వేల నుంచి 20వేలకు విలువ గల భూములను బైపాస్ రోడ్డు కోసం తీసుకుంటే ఎలా బతకాలని ఆవేదనతో తెలిపారు. దీంతో వారు స్పందించి సమస్యను కేంద్ర మంత్రి నితిన్‌గడ్కార్ దృష్టికి తీసుకెళ్లి బైపాస్ రోడ్డు అలైన్మెంట్ మార్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గద్దె బ్రహ్మయ్య, పుప్పాల శంకర్, గుండెల జలందర్, పుప్పాల నరసయ్య పాల్గొన్నారు.

బుగ్గారం ఇన్‌చార్జి సర్పంచ్‌గా రామక్రిష్ణ

బుగ్గారం జనవరి21: నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగం మేరకు బుగ్గారం గ్రామ సర్పంచ్ సస్పెన్షన్‌కు గురి కావడంతో ఉప సర్పంచ్ నగునూరి రామక్రిష్ణకు ఇన్‌చార్జి సర్పంచ్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల కో అప్షన్ సభ్యులు అబ్దుల్ రహమన్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఇన్‌చార్జి సర్పంచ్ రామక్రిష్ణాని శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ సుద్దల శరత్, ఆటో యూనియన్ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు సందిప్, మహేష్, శేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు అడ్లూరి పరామర్శ



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జనవరి 21: రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిపోర్టర్ అక్కెనపెల్లి బాబుకుమార్ తీవ్రంగా గాయపడి కాలు కోల్పోవడం దురదృష్టకరమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వద్ద రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో నేరెళ్ల గ్రామానికి చెందిన అక్కెనపెల్లి బాబుకుమార్ తీవ్రంగా గాయపడి కాలు కోల్పోయాడు. దీంతో జగిత్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాబుకుమార్‌ను ఆయన ఆదివారం పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ 10 వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే ధర్మపురి పట్టణానికి చెందిన రిటైర్డ్ లైబ్రేరియన్, ముస్లీం కమిటీ నాయకులు ఎండీ అఫ్జల్ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా విప్ లక్ష్మణ్‌కుమార్ ఆయనను పరామర్శించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, సుముఖ్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేద పారాయణం, హవనం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ధర్మపురి, జనవరి 21: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం లో సంపూర్ణ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, సంపూర్ణ ఋగ్వేద హవనం, సంపూర్ణ సామవేద పారాయణం కార్యక్రమాలు నాలగవ రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. లోక క్షేమార్థం, ఈ నెల 18 నుంచి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భాగంగా నాలగవ రోజు 21 మంది వేదపండితులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, రినోవేషన్ కమిటీ సభ్యులు, స్థానిక వేదబ్రాహ్మణులు ఈ కార్యక్రమానికి సహకారం అందించారు. ఈ కార్య క్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ముత్యాలశర్మ, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఇందారపు రామయ్య, ఆలయ మాజీ చైర్మన్ సంగనభట్ల దినేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా యువజన సంఘం కార్యవర్గం

గొల్లపల్లి, జనవరి 21: ఆల్ ఇండియా యువజన సంఘం మండల అధ్యక్షుడిగా బోజనపు శ్రీనివాస్ ఆదివారం ఎన్నికయ్యారు. గొల్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఇనుగంటి గంగయ్య, నక్క గంగరాజం, ప్రధాన కార్యదర్శిగా కూన రాజేందర్, సహాయ కార్యదర్శులుగా మిట్ట కిష్టయ్య, మద్దెల జగన్‌మోహన్, కొప్పుల సుధాకర్, కరాజుల అంజి, జనుప శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా కోమల్ల వెంకటపతి, నక్క గంగయ్య ఎన్నికవగా, కోశాధికారిగా జనుప శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బొంకంటి రవి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గొర్రె జాకబ్‌లతో పాటు 11 మంది కార్యవర్గ సభ్యుల ను ఎన్నుకున్నారు.

ఓటర్ నమోదు పకడ్బందీగా నిర్వహించాలి



బీఎల్‌వోలకు సూచనలు చేస్తున్న ఆర్‌డీవో రాజేశ్వర్

కోరుట్ల, జనవరి 21 : ఓటర్ నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌డీవో రాజేశ్వర్ బీఎల్‌వోలకు సూచించారు. పట్టణంలోని రెండు రోజులగా నిర్వహిస్తున్న ఓటర్ నమోదు ప్రత్యేక కేంద్రాలను ఆదివారం ఆర్‌డీవో రాజేశ్వర్ పరిశీలించారు. ఫాం-6, ఫాం-7, ఫాం8 ద్వార నమోదు అయిన ఓటర్ నమోదు ప్రతాలను పరిశీలించారు. ఓటర్ నమోదుతో పాటు వివిధ రకాల నమోదు 1506 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ డివిజన్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఆర్‌డీవో రాజేశ్వర్ మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు పాటించి ఓటర్ నమోదు కార్యాక్రమాన్ని చెపట్టాలని అన్నారు. రెవెన్యూ సిబ్బందితో పాటు బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మల్లాపూర్: ఎన్నికల అధికారల నిబంధనల మేరకు మండలంలోని జరుగుతున్న ఓటరు నమోదు కేంద్రాలను మల్లాపూర్ తహసీల్దార్ వీర సింగ్ పరిశీలించారు. ఆదివారం మండలంలోని చిట్టాపూర్, గుండంపల్లి, సాతారంతో పాటు పలు గ్రామాల్లోని కేంద్రాలను పరిశీలించి స్వీకరిస్తున్న దరఖాస్తు ఫారంల వివరాలను నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో 18 ఏళ్ల నిండి ఉన్న వారిని గుర్తించి ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకునేలా తెలియజేయాలని వివరించారు. గ్రామంలో కొతగా నమోదు చేసు కునేవారి వివరాలను పూర్తిగా ఫారంలో తెలియజేసే విధంగా వారికి వివరించాలన్నారు. చిట్టాపూర్‌లో అత్యధికంగా కొత్త ఓటు హక్కు కోసం దరఖాస్తులు రాగా వాటిని నిర్వహకులు స్వీకరించారు.



జగమంతా రామమయం

జిల్లాలో మార్మోగుతున్న రామనామం

- ప్రతీఇంటిపై కోదండరాముడి జెండా
- నేడు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు



అయోధ్య అక్షింతల ఊరేగింపును నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్



అయోధ్య అక్షింతల ఊరేగింపును నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అంతా రామమయం ఈ జగ మంతా రామమయం అన్నట్లుగా జిల్లా అంతా శ్రీరామ నామస్మరణ మా ర్మోగుతోంది. సెల్‌ఫోన్లలో వాల్‌పోస్టర్ల దగ్గర నుంచి వాట్సప్ ఫేస్‌బుక్ పో స్టులు, డీపీలు, స్టేటస్, రీల్స్, షార్ట్స్ దాకా ...అన్నింటా అయోధ్య రాముడే కనిపిస్తున్నారు. ఉదయం ఆలయాల్లో రామనామ జపం, సాయంత్రం రామాయణ సప్తాహాలు కొనసాగుతున్నాయి. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను భాగస్వామ్యం చేస్తూ పలు కార్యక్రమాలను ఇ ప్పటికే నిర్వహిం చారు. అయోధ్య శ్రీరామ జన్మ భూమి మందిరంలో ఈనె ల 22వ తేదీన రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ ఉత్స వం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పలు ప్రత్యేక కార్యక్రమాలు జర పడానికి శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టుతో పాటు భక్తులు సిద్ధమవుతున్నారు.

● స్మార్ట్‌ఫోన్లలో మార్మోగుతున్న రామ నామం....

రామ్ శ్రీ రామ్....శ్రీ రామ్ జైజై రామ్ అంటూ సెల్‌ఫోన్ల రింగ్‌టోన్‌గా నూ రామనామమే మార్మోగుతోంది. ఎవరైనా ఫోన్ చేస్తే కాలర్‌టూన్ గా నూ రాముడి పాటలే పెట్టుకుంటున్నారు. తమ ఫోన్ల వాల్‌పేపర్‌తో పా టు వాట్సప్ డీపీలుగానూ రాముడే దర్శనమిస్తున్నారు. వారం పది రోజు లుగా సోషల్ మీడియాలో ప్రతీ పది పోస్టులలో 6-8 వరకు అయోధ్యకు సంబంధించినవే ఉంటున్నాయి. ఈ రెండు రోజుల నుంచి మరింతగా రా ముడు, రామాయణం, అయోధ్య, కరసేవ, బాల రాముడు, ఆలయ నిర్మాణం తదితర అంశాలకు సంబంధించినవే పోస్టు చేస్తున్నారు.

● రామనామ జపాలు..సప్తాహాలు...

జిల్లా వ్యాప్తంగా పలు దేవాయాల్లో బాల రాముడు కొలువుదీరే వేళను జీవితాంతం గుర్తుండి పోయేలా పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని చాలా గ్రామాల్లోని ఆలయాల్లో ఇప్పటికే రామనామ జపాలు కొనసాగిస్తున్నారు. రామకోటి రాయిస్తున్నారు. సాయంత్రం రామా యణం పై సప్తాహహాలు కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని కోదండ రామా లయం, మెట్‌పల్లిలోని కోదండ రామాలయం తదితర వాటిల్లో నిత్య ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

● ప్రత్యేక స్క్రీన్‌ల ఏర్పాటు...

ఈనెల 22వ తేదీన అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవం తిలకిచండానికి జిల్లా కేంద్రంతో పాటు పలు పట్టణాలు, మండల కేంద్రాల్లో ప్రత్యేక స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్రం పిలుపు మేరకు ఈనెలలో మకర సంక్రాంతి నుంచి ఇప్పటివరకు పలు ఆలయాల్లో శుభ్రతా కార్యక్రమాలను నిర్వహించారు. ఈనెల 22వ తేదీన పలు ఆలయాల్లో సామూహిక రామ నామ సంకీర్తనలు నిర్వహించను న్నారు. పలు ఆలయాలు, చౌరస్తాల వద్ద టీవీలు, ఎల్‌ఈడీలు, స్క్రీన్‌లు ఏర్పాటు చేసి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని సామూహికంగా తిలికించడా ని కి ప్రయత్నిస్తున్నారు. ప్రాణ ప్రతిష్ఠ రోజున ప్రతీ ఇంటి గుమ్మ వద్ద, దు కాణాల వద్ద కనీసం అయిదు దీపాలను వెలిగించడానికి ఏర్పాట్లు చేసు కుంటున్నారు. జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల ప్రాంతాల్లో స్క్రీన్‌లు ఏ ర్పాటు చేస్తున్నారు. కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణోత్స వా న్ని, అన్నదానం, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహిం చనున్నారు.

● ఇంటింటికీ రాముడి అక్షింతలు...

అయోధ్యలో పూజించిన అక్షింతలు ఇప్పటికే ఇంటింటికీ చేరాయి. జిల్లాలో సుమారు రెండు లక్షల కుటుంబాలకు రామ భక్తులు అయోధ్య అ క్షింతలను అందించారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం అక్షింతల పంపి ణీని ముగించారు. ఇక శ్రీరామరక్ష సర్వ జగద్రక్ష అన్న మంత్రంతో ఉన్న స్టిక్కర్లను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. వీటితోపాటు పలు చోట్ల రా ముడి ఫొటోతో పాటు ఉన్న జెండాలను ఇళ్లపై ఎగురవేయడానికి ఇస్తు న్నారు. పలు సంఘాలు ఈనెల 22వ తేదీన అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఇళ్లలో వెలిగించేందుకు అయిదు దీపాలను అందిస్తున్నారు.

● అయోధ్యకు వెళ్లడానికి ప్రత్యేక వాహనాలు..

ప్రాణ ప్రతిష్ఠ తదుపరి భక్తులు అయోధ్యకు వెళ్లడానికి ప్రత్యేక వాహనాలు సమకూర్చుకుంటున్నారు. పలు టూరిస్టు నిర్వాహకులు ప్రత్యేక ప్యాకేజీలతో టూర్‌లు నిర్వహిసున్నారు.అదేవిదంగా రైల్వే శాఖ, ఆర్టీసీ ప్రత్యేక వాహనాలను నడుపుతున్నాయి. పలువురు భక్తులు సొంత వాహనాల్లో కుటుంబసమేతంగా వెళ్లడానికి సిద్ధమవు తున్నారు.

చంద్రపురి కాలనీలో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, జనవరి 21: కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలోని చంద్రపురి కాలనీలో శనివారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో ఇంటిలో అగ్నిప్రమాదం జరగ్గా రూ.8 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు యూబీఐ బ్యాంక్ మేనేజర్ శ్రీరామోజు చిరంజీవి తెలిపారు. ఏసీ, ఫ్రిడ్జ్, ఇంటీరియల్ డెకోరేషన్‌తో పాటు ఇతర వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు స్వల్పంగా గాయాలయ్యాయని తెలిపారు. బాధిత కుటుంబాన్ని కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ పరామర్శించి, ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కరీంనగర్ క్రైం, జనవరి 21: కరీంనగర్‌లోని ఒక హోటల్‌లో పేకాట ఆడుతున్న 11మంది జూదరులను పట్టుకున్నామని ఒకటో టౌన్ సీఐ జె సరిలాల్ తెలిపారు. జూదరుల నుంచి లక్షా 31వేల 200 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టుబడిన జూదరులపై గేమింగ్ యాక్టు కింద కేసు నమోదు చేశామన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 21: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు కూలీగా పనిచేస్తున్న పల్లెపు సాయి(23) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. పెద్దపల్లికి చెందిన సాయి కొంత కాలంగా బొమ్మకల్ గ్రామ శివారులోని లారీ అసోసియేషన్ వద్ద నివాసం ఉంటూ కూలి పనిచేస్తున్నాడు. 15 రోజుల నుంచి పనికి వెళ్ళకుండా మద్యానికి బానిసగా మారాడు. ఈ నెల 17న మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

హుజూరాబాద్, జనవరి 21: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడం లేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు గ్యారంటీలు మాత్రమే అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రూట్ మ్యాప్ లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ భూముల మీద పడితే ప్రస్తుతం ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవసాయ, విశ్వవిద్యాలయాల భూములను హైకోర్టుకు ఇస్తానని అంటున్నారన్నారు. హైకోర్టును విజయవాడ లేదా నిజామాబాద్ రోడ్‌లో నిర్మించవచ్చన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రామాలయం చుట్టూ తిరగడం తప్ప ప్రజలకు ఏం చేసిందో చెప్పాలన్నారు. తెలంగాణలో నిర్మించిన ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందనేది వాస్తవమేనని, దీనిపై బీజేపీ, కాంగ్రెస్ సీబీఐ విచారణకు ఎందుకు కోరడం లేదన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో బీఎస్పీని బలపర్చాలన్నారు.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
ఫోరం మాల్ - కూకట్‌పల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
గలేరియా - పంజాగుట్ట
ఐకాన్ - హైటెక్‌సిటీ
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి
ఆట్రియమ్ - గచ్చిబౌలి
ఎస్2 సోమ - మల్లాపూర్
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్
ఎం.పి మాల్ - కాచిగూడ
జిఎస్ఎమ్ - మదీనగూడ
నెక్లెస్ సత్య - కవాడిగూడ
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్
మంజీరామాల్ - కూకట్‌పల్లి
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి
మంత్రామాల్ - అత్తాపూర్
సుధా - శాలిబండ
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఏషియన్ వైష్ణవి - ఆర్.సి.పురం
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
సినీ ప్లానెట్ - కొంపల్లి
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఏషియన్ రాధిక - కాప్రా
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
మిరాజ్ సినిమాస్ - బాలానగర్
మిరాజ్ సినిమాస్ - చందానగర్
లక్ష్మీనరసింహ - మియాపూర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
మూవీటైమ్ - అమీర్‌పేట
ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
టివోలి - సికింద్రాబాద్
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
షా షహెన్‌షా - చింతల్
లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
మూవీమ్యాక్స్ - మౌలాలి
జె.పి.సినిమాస్ - చందానగర్

రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు


భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం

వేములవాడ, జనవరి 21: మేడారం సమ్మక్క సారక్క జాతర సమీపి స్తున్న తరుణంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రానికి భక్తుల తాకిడి పెరుగుతోంది. సమ్మక్క సారలమ్మ దర్శనానికి ముందు రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకునే ఆనవాయితీ ప్రకారం ఆదివారం నాడు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వేము లవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు తమ ఇష్ట దైవమైన రాజ రాజేశ్వరస్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొని తరించారు. తొలుత ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ కారణంగా లఘుదర్శనం అమలు చేయడం తో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. కళాభవన్‌లో స్వామివారి నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రి పుర సుందరిదేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్దసంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచ మ్మ దేవాల యం సైతం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేలాది మంది భక్త లు బద్దిపో చమ్మను దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులసంఖ్య భారీగా ఉండడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా భక్త లకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

● కొనసాగిన నిరంతర దర్శనం..

వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో ఆదివారం రాత్రి స్వామివారి దర్శనం నిరంతరాయంగా కొనసాగింది. భారీగా పెరుగుతున్న భక్తుల రద్దీని తట్టుకునేందుకు ఆదివారాల్లో రాత్రిపూట శ్రీ స్వామివారి ఆలయం తెరిచి ఉంచాలని అధికారులు నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి స్వామివారి దర్శనం నిరంతరాయంగా కొనసాగించారు. మరో నాలుగు వారాలపాటు ప్రతి ఆదివారం రాత్రి వేళ కూడా శ్రీ స్వామివారి ఆలయం భక్తుల దర్శనం కోసం తెరిచి ఉంచుతామని ఆలయ అధికారులు తెలిపారు.

ఆదివారం నుంచి సోమవారం రాత్రి వరకు నిరంతర దర్శనం

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు రానున్న నాలుగు వారాల్లో ఆదివారం ఉదయం నుంచి సోమవారం రాత్రి వరకు నిరంతర దర్శన సౌకర్యం కల్పించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. ఫిబ్రవరిలో సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనం కోసం భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఒకవైపు మేడారం జాతర సమీపిస్తుండడం, మరోవైపు మహాశివరాత్రి పర్వదినం దగ్గర పడుతుండడంతో రాజరాజేశ్వరస్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. రద్దీ పెరుగుతున్న క్రమంలో స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. సర్వదర్శనం కోసం సుమారు మూడు నుంచి నాలుగు గంటలు, కోడెమొక్కు చెల్లింపు కోసం ఐదు నుంచి ఆరు గంటలకు పైగా భక్తులు క్యూ లైన్‌లలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఈ పరిస్థితిని అధిగమించి స్వామివారి దర్శనం త్వరగా లభించే విధంగా వచ్చే నాలుగు వారాల్లో ఆదివారం ఉదయం నుంచి సోమవారం రాత్రి వరకు స్వామివారి ఆలయం తెరిచి ఉంచాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. ఆదివారం రాత్రి నిశి పూజ అనంతరం ఆలయాన్ని రాత్రంతా భక్తుల దర్శనం కోసం తెరిచి ఉంచుతారు. ఈనెల 28 తేదీ, ఫిబ్రవరి 4, 11, 18 తేదీల్లో రాత్రి వేళలో సైతం భక్తులు స్వామి వారిని దర్శించుకోవచ్చుని, కోడె మొక్కు చెల్లించుకోవచ్చని ఆలయ ప్రొటోకాల్ విభాగం సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు వెల్లడించారు.

● నరసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ..


స్వామివారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. సెలవు దినం కావడం వల్ల ఉదయం గోదావరి నదిలో స్నానాలు చేశారు. భక్తులు శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాల్లో స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

గుమ్మడి కాయతో అయోధ్య రామ మందిరం


గుమ్మడి, క్యారెట్‌తో తీర్చిదిద్దిన అయోధ్య ఆలయం, ఇన్‌సెట్‌లో అనిల్

ఎల్లారెడ్డిపేట, జనవరి 21: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కళాకారులు విభిన్న రీతుల్లో భక్తిభావం చాటుకుంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కార్వింగ్ కళాకారుడు శ్యామంతుల అనిల్ గుమ్మడి కాయ, క్యారెట్‌తో ఆదివారం రామ మందిరం ఆకృతిని తీర్చిదిద్దాడు. రెండు గుమ్మడి కాయలు, అర కిలో క్యారెట్ కలిపి ఆలయా న్ని త్రీడీ ఆకారంలో నాలుగు గంటల్లో 12 ఇంచుల ఎత్తు, 16 ఇంచుల పొడవు, 13 ఇంచుల వెడల్పుతో అయోధ్య రామమందిరం తయారు చేశాడు. విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ రోజున స్థానిక సత్సంగ సదనంలో జరిగే కార్యక్రమంలో తాను తయారు చేసిన ఆలయ ఆకృతిని ప్రదర్శించనున్నట్లు కళాకారుడు అనిల్ పేర్కొన్నారు.

ఖాతాదారుడి ప్రమేయం లేకుండా రూ. లక్షా 45 వేల డ్రా

- పోలీసులను ఆశ్రయించిన భాధితుడు

పెద్దపల్లి రూరల్, జనవరి 21: ఖాతాదారుడి ప్రమేయం లేకుండానే అతని ఖాతా నుండి గత నెల 6వ తేదీ నుండి 26వ తేదీ వరకు రూ. లక్ష 46 వేల 300లను డ్రా చేశారు. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న ఖాతాదారుడు లబోదిబోమంటూ ఈనెల 20వ తేదీన పెద్దపల్లి పోలీసులను ఆశ్రయించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి మండలం గుర్రాంపల్లి గ్రామానికి చెందిన బుర్ర లక్ష్మణ్‌గౌడ్ వ్యక్తికి పెద్దపల్లి పట్టణంలోని ఎస్‌బిఐ కమాన్ బ్రాంచిలో 00000033004053238 ఖాతా ఉంది. ఈ ఖాతా నుండి గత నెల 6వ తేదీ నుండి 26వ తేదీ వరకు రూ. లక్షా 43 వేల 300 రుపాయలు డ్రా అయ్యాయి. బ్యాంకు కువెళ్లి బ్యాలెన్స్ చూసుకునే సరికి డ్రా చేసినట్లు చూయించడంతో వెంటనే పెద్దపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెద్దపల్లి ఎస్ఐ 2 మల్లేష్ భాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువ వద్ద గుర్తు తెలియని మృతదేహం

చొప్పదండి, జనవరి 21: మండలంలోని భూపాలపట్నం శివారులోని డి-86 కాలువ వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్ఐ ఉపేంద్రాచారి తెలిపారు. కాలువ వద్ద మృతదేహం ఉన్నట్లు ఆదివారం మధ్యాహ్నం సమాచారం అందగా సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉన్నట్లు తెలిపారు. సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం చేసినట్లు, మృతి చెందిన వ్యక్తి 40 నుంచి 45 ఏళ్ల వ్యక్తిగా తెలుస్తుందని ఎస్ఐ తెలిపారు.

కొండగట్టులో సీతారాముల ఆనవాళ్లు


● రాముని పాదుకలు, సీతమ్మ కన్నీటి గుంతలు ● అయోధ్యలో బాల రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా భక్తుల మననం


రాముని పాదుకలు


సీత జలకాలు ఆడిన కోనేరు

మల్యాల, జనవరి 21: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో సీతారా ముల ఆనవాళ్లు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుండగా నేడు అయోధ్యలో ని ర్వహించే బాల రాముని ప్రాణప్రతిష్ఠోత్సవం సందర్భంగా మననం చేసుకుంటు న్నారు. కొండగట్టులో శ్రీరాముని పాదుకలు, సీతమ్మ కన్నీటి గుంతలు భక్తులను తన్మయత్వానికి గురి చేస్తున్నాయి. వీటి వద్ద భక్తులు పూజలు కూడా చేస్తుం టారు. రామలక్ష్మణ, సీతా దేవిల వనవాసం సందర్భంగా రాముడు ఇక్కడికి వచ్చా డని అప్పుడు బండ రాయిపై నిలబడినప్పుడు ఏర్పడినవే ఈ పాదుకలంటూ భ క్తులు వాటిని దర్శించుకుంటుండగా అదే సమయంలో వనవాసం సందర్భంగా సీతాదేవి ఏడవడంతో కన్నీటి దారలకు ఏర్పడినవే కన్నీటి గుంతలుగా భక్తులు పసుపు, కుంకుమతో పూజిస్తుంటారు. అలాగే కొండల రాయుడి కోటపై గల నీటి గుంతను సీతమ్మ కోనేరుగా, ఇక్కడ సీత జలకాలు ఆడినట్లు భక్తులు చెప్పుకుంటారు.

ప్రభుత్వ సలహాదారుగా హర్కార వేణుగోపాల్‌రావు



గోదావరిఖని, జనవరి 21: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా (ప్రొటోకాల్ ప్రజా సంబంధాలు) హర్కార వేణుగోపాల్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశాలు జారీ చేశారు. క్యాబినెట్ ర్యాంకు హోదా కల్పించనున్నట్టు ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. విలేజి రామగుండంకు చెందిన హర్కార వేణుగోపాల్‌రావు ప్రస్తుతం ఏఐసీసీ సభ్యుడిగా పని చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

మానకొండూర్, జనవరి 21: మానకొండూర్ గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానిక సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అన్నారం గ్రామానికి చెందిన పుసాల అక్షయ్‌కుమార్ (21) మోటార్ సైకిల్‌పై కరీంనగర్ వైపు వెల్లుతుండగా ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులకు మట్టిని తరలిస్తున్న టిప్పర్ ఢీకొందని తెలిపారు. ఈ ప్రమాదంలో అక్షయ్‌కుమార్‌కు తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి శ్రీదేవసేన


ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న శ్రీదేవసేన

సుల్తానాబాద్, జనవరి 21: అర్హులైన వారందరూ కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనీ సీనియర్ ఐఏఎస్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నోడల్ అధికారి శ్రీదేవసేన పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీదేవసేన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు కావాలని సూచించారు. ఓటర్ల జాబితాను అప్‌డేట్ చేయడంలో భాగంగా ఆయా గ్రామాల్లో చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని, వలస వెళ్లిన వారి పేర్లను సరి చేసుకోవాలని తెలిపారు. రెండు రోజుల పాటు ప్రత్యేకంగా ఓటర్ నమోదు కార్యక్రమం ఉమ్మడి జిల్లా పరిధిలో కొనసాగుతుందని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలో తాను పరిశీలించి పలు సలహాలు సూచనలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, బీఎల్వోలు పాల్గొన్నారు.

250క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

● ఒకరి అరెస్టు... ముగ్గురు పరారీ

హుజూరాబాద్, జనవరి 21: హుజూరాబాద్ పట్టణ శివారులోని కరీంనగర్ రోడ్‌లో గల ఓ రైస్‌మిల్లులో 250క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఏసీపీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హుజూరాబాద్‌లోని సీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హుజూరాబాద్ శివారులో రేషన్ బియ్యం మిల్లుల్లో దిగుమతి అవుతున్నాయని స్పెషల్ బ్రాంచీ టాస్క్‌ఫోర్స్ అధికారుల సమాచారం మేరకు సీఐలు సంతోష్‌కుమార్, బొల్లం రమేష్, ఎస్ఐ రాజు దాడులు నిర్వహించారన్నారు. ఇందులో 250క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు. అలాగే బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేశామన్నారు. పట్టణానికి చెందిన ఎస్ శ్రీనివాస్ అనే వ్యక్తితో పాటు పిల్లి శ్రీధర్, సురేష్, రమేష్ బియ్యం దందా చేస్తున్నారన్నారు. వీరిలో శ్రీనివాస్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. ఇతనిపై గతంలో కూడా కేసులు ఉన్నాయన్నారు. రేషన్ బియ్యాన్ని హుజూరాబాద్ డివిజన్‌లో ఎవరూ కొనుగోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీడీఎస్ బియ్యం దుర్వినియోగం చేస్తే పీడీయాక్టు నమోదు చేస్తామన్నారు. మిల్లర్లు కూడా రేషన్ బియ్యం కొనుగోలు చేయవద్దన్నారు. సమావేశంలో సీఐ బొల్లం రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రుక్మాపూర్‌కు ట్రైనీ ఇంజనీర్లు


సమావేశమైన ట్రైనీ ఇంజనీర్లు

చొప్పదండి, జనవరి 21: మండలంలోని రుక్మాపూర్ గ్రామానికి మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్‌లోని ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్ ట్రైనీ అధికారులు శిక్షణ కోసం వచ్చారు. గోపాల్‌సింగ్, సనత్ రెడ్డి, రాంచందర్, శ్వేత ఉపాధ్యాయ్, సాక్షి ముద్లియార్, సఫల్‌లు శిక్షణ కోసం రాగా ఈ నెల 25 వరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బస చేయనున్నారు. ఎంపీపీ చిలుక రవీందర్, ఎంపీడీవో స్వరూప, ఎంపీవో రాజగోపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ విజయసారధి, కార్యదర్శి మేహతబ్, ఏపీవో రాజు, ఏపీఎం నర్మద, డాక్టర్ శైలేందర్‌లు ట్రైనీ ఇంజనీర్లతో సమావేశం అయ్యారు.

బస్సుల కోసం భక్తుల ఇబ్బందులు


వేములవాడ బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, జనవరి 21: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ బస్సులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, హన్మకొండ, కోరుట్ల తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బస్సుల కోసం ఆర్టీసీ బస్టాండ్‌లో గంటల తరబడి నిరీక్షించారు. సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా వేములవాడకు భక్తుల రద్దీ పెరిగింది. అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని, ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి

మెట్‌పల్లి స్వర్ణకార సంఘం అధ్యక్షుడు నాంపల్లి సింహాద్రి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సింహాద్రి

మెట్‌పల్లి, జనవరి, 21 : ప్రతి నిత్యం పనులతో బిజీగా గడిపే వ్యాపారులు ఆటలు ఆడడంతో మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మెట్‌పల్లి స్వర్ణకార సంఘం అధ్యక్షుడు నాంపల్లి సింహాద్రి అన్నారు. ఆదివారం స్వర్ణకార సంఘం తరుపున నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలపై మక్కువ ఉన్న సంఘం సభ్యులకు స్వర్ణకార సంఘం తరుపున ప్రోత్సాహాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. మన శరీరానికి కావలసిన శ్రమ ఆటలతో లభిస్తుందని, యువత సమయం ఉన్న సందర్భంలో క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి దురిశెట్టి నటరాజ్, కార్యవర్గ సభ్యులు, క్రీడాకారులు, పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల గ్రామ సంకీర్తన



నగర సంకీర్తనలో పాల్గొన్న గ్రామస్తులు

కోరుట్ల రూరల్, జనవరి 21 : మండలంలోని అయిలాపూర్ గ్రామంలో ఆదివారం జై శ్రీరాం సేవా సమితి ఆధ్వర్యంలో సీతారాముల గ్రామ సంకీర్తన వైభవంగా జరిగింది. గ్రామం శివారులోని ఆంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలను నిర్వహించి గ్రామ సంకీర్తన జరిపారు. ఆయేధ్య పట్టణంలోని రాములోరి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా గ్రామంలో స్వామి వారి గ్రామ సంకీర్తనను జరిపారు. సంకీర్తనకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలుకగా భక్తులు శ్రీరామా నామ జపం చేస్తే శోభయాత్రలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు దప్పూరి మధుసుధన చార్యులు, హిందువాహిని సంఘ నాయకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

సర్పంచ్ జైలుకెళితే కాంగ్రెస్‌కేంటి సంబంధం

ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించిన మండలనాయకులు

జగిత్యాలరూరల్, జనవరి 21 : హబ్సీపూర్ సర్పంచ్ జైలుకెళితే కాంగ్రెస్ పార్టీకేమి సంబంధమని, కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతోనే బీఆర్‌ఎస్ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డిని జైలుకు పంపించారని ఎమ్మెల్యే సంజయ్ వ్యాఖ్యలు చేయడం సరికాదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, జగిత్యాల రూరల్ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు జున్ను రాజేందర్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఇందిరాభవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ కుట్రలకు కాంగ్రెస్ ఎప్పుడు పాల్పడలేదని పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ కుట్రలతో కాంగ్రెస్ నాయకుల పై కేసులు పెట్టించింది ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అని ఆరోపించారు. చల్‌గల్‌లో కక్ష్యకట్టి అక్రమంగా జున్ను రాజేందర్ పై కేసు పెట్టించారని, అలాగే జాబితాపూర్‌కు చెందిన మారు గంగారెడ్డి పై కేసు పెట్టించింది ఎమ్మెల్యేనని ఆరోపించారు. ఇతరులపై నిందలు వేసేముందు ఆలోచించి మాట్లాడాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు కాంగ్రెస్ నాయకులు సూచించారు. కేవలం కాంగ్రెస్ పార్టీపై బురదజల్లేందుకే ఎమ్మెల్యే నీచరాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చంద్రారాధకిషన్, నారాయణరెడ్డి, ముస్కు దామోదర్‌రెడ్డి, గంగాధర్, గంగన్న, శంకర్, శేఖర్, పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

కోరుట్ల, జనవరి 21 : అయోధ్య రామ మందిర్‌లో రాములోరి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో అన్ని దేవలయాలలో ఉత్సవాలు నిర్వహించడానికి నిర్వహకులు ముస్తాబు చేస్తున్నారు. పట్టణంలోని రామాలయం, వేంకటేశ్వర, అంజనేయ స్వామి దేవాలయాలలో ఉత్సవాలు నిర్వహించడానికి నిర్వహకులు ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి నగర సంకీర్తనలు జరిపి దేవాయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వాసవి కళ్యాణ భవనంలో రామశోభయాత్ర కమిటీ ఆధ్వర్యంలో రాములోకి నగర సంకీర్తన జరిపి అన్నదానం కార్యక్రమ జరుపనున్నారు. వేదపండితుడు పాలెపు రాంశర్మ ఆధ్వర్యంలో రాములోరి కల్యాణం నిర్వహించి వేడుకలను జరుపనున్నారు. పలు దేవాలయాలు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, బీజేవైఎం, హిందు దార్మిక సంఘ నాయకులు దేవాలయాలను శుభ్రం చేసి వేడుకలకు సిద్ధం చేస్తున్నారు. పలు దేవాలయాలలో సుందర కాండ, రామాయణ పారాయణ కార్యక్రమాలు చేసే విధంగా ఏర్పాట్లును చేస్తున్నారు. ఇప్పడికే పలు వార్డులలో విశ్వహిందు పరిషత్, అర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ అక్షంతల పంపిణీ కార్యక్రమంతో పాటు జై శ్రీరాం నినాదంతో గోడలకు రాతలను ముద్రించారు. పట్టణంలోని అన్ని వార్డులలో భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసే విధంగా హిందూ దార్మిక సంఘ నేతలు ప్రత్యేక చొరవ తీసుకోని ఏర్పాట్లు చేస్తున్నారు.

హనుమాన్ ఆలయంలో 108 రకాల నైవేద్యాలు

మెట్‌పల్లి, జనవరి, 21 : పట్టణంలోని గోల్ హనుమాన్ ఆలయంలో శనివారం రాత్రి స్వామి వారికి భక్తులు 108 రకాల నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అయోధ్యలో శ్రీ రాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా ఆలయంలో గత 11 రోజుల నుంచి రామ భక్త భజన హనుమాన్ చాలీసా వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పురోహితుడు మధన్ శర్మ తెలిపారు. భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రతి రోజు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి రామ భజన, హనుమాన్ చాలీసా పారయణం వంటి కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి స్వామి వారికి 108 రకాల నైవేద్యాలను భక్తులు సమర్పించారు. సోమవారం శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతున్న రోజు కాబట్టి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

ఎల్లారెడ్డిపేట, జనవరి 21: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్, వెంకటాపూర్, హరిదాస్‌నగర్, పదిర, అక్కపల్లి, దుమాల, అల్మాస్‌పూర్, రాజన్నపేట, గుండారం, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. తహసీల్దార్ రాంచందర్, నాయబ్ తహసీల్దార్ జయంత్‌కుమార్ పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, మార్పులు- చేర్పులకు చేపడుతున్న ప్రక్రియను పరిశీలించారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఆయా కేంద్రాల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలి

సిరిసిల్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని అప్పుడే నమ్మకాన్ని చూరగోంటారని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. ఆదివారం సిరిసిల్లలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో తిరుమల ఎలక్ట్రానిక్స్ ఏర్పాటు చేసిన మెగా బంపర్‌డ్రా విన్నర్‌ను ఎంపిక చేశారు. బంపర్ బహుమతి బుల్లెట్ బైక్ సిరిసిల్లకు చెందిన ఈ లావణ్య, ప్రథమ బహుమతి దేవేందర్, రెండో బహుమతి ఎం. హరీష్, మూడో బహుమతి ఎ.శ్రీనివాస్, జి.రవి గెలుపొందారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ 1987 నుంచి నాణ్యమైన వస్తువులను అమ్ముతూ ప్రజల్లో మన్ననలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల ఎలక్ట్రానిక్ యజమానులు పోకల సుమన్, సుధాకర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కటకం సత్తయ్య, పోకల లావణ్య, వివిధ కంపెనీల మేనేజర్లు పాల్గొన్నారు.

సూరమ్మ చెరువుపై చిగురిస్తున్న ఆశలు..

- ఇరిగేషన్ అధికారులతో రెండు ధఫాలుగా ఎమ్మెల్యే చర్చలు
- మూడు దశల కింద పనుల విభజన
- తాజాగా ప్రారంభమైన సర్వేలు



ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



సర్వేలు కొనసాగిస్తున్న అధికారులు

కథలాపూర్, జనవరి 21 : ఏళ్ల తరబడి హామీలతో నలిగిపోతున్న సూరమ్మ చెరువుపై ఆశలు చిగురిస్తున్నాయి. దశాబ్దకాలంగా బీఆర్‌ఎస్ సర్కారు తట్టెడు మట్టి తీయక రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని 39 సార్లు రకరకాల నిరసనలు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వేములవాడ ఎమ్మెల్యేగా గెలిచిన ఆది శ్రీనివాస్ గతంలో ప్రతిపక్ష హోదాలో గాడిద, దున్నపోతు, రాజ్యాంగ నిర్మాణ అంబేద్కర్‌కు వినతి పత్రాలు అందించడంతో పాటు పాదయాత్రలు నిర్వహించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలిచిన నేపథ్యంలో సూరమ్మ పనుల్లో కదలిక తేవాలని కంకణం కట్టుకున్నారు. ఇప్పటికే ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో రెండు దఫాలుగా సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేయడంతో పనుల కొనసాగింపుపై ఆశలు చిగురిస్తున్నాయి.

● మూడు దశలుగా పనుల విభజన

బీమారం, మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లోని సుమారు 45 వేల ఎకరాల బీడు భూములను ఈ రిజర్వాయర్‌తో సస్యశ్యామలం చేయాలని నిర్ణయించారు. పదేళ్ల కిందట అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేట్ 2 ఫేజ్ 1లో పంపింగ్‌తో ఈ రిజర్వాయర్‌ను నింపాలని ప్రతిపాదించారు. పైపుల నిర్మాణ పనులు నత్తనడకక సాగాయి. పైపుల పనులు పూర్తయినప్పటికీ చివరి పంపు కావడంతో నీళ్లు ఇక్కడి దాకా రావడం గగనంగా మారింది. మత్తడి నిర్మాణ పనులు కూడా కాంట్రాక్టర్ పూర్తి చేయకపోవడంతో వరద ఉధృతికి మత్తడి కోతకు గురై ఏటా వానాకాలంలో నీరంతా వృధాగా పోతోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆరు సంవత్సరాల కిందట కుడి, ఎడమ కాలువల నిర్మాణం కోసం రూ. 204 కోట్లు మంజూరు చేసి టెండర్లు పిలవగా ఓ నిర్మాణ సంస్థ పనుల నిర్వాహణకు ఒప్పందం చేసుకుంది. క్యాంపు ఏర్పాటు చేసుకుని ఇసుక రాశులను నిల్వ చేసుకుంది. కుడి, ఎడమ కాలువల్లో భూములు కోల్పోతున్న సుమారు 500 ఎకరాలకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో పనులకు గ్రహణం పట్టింది. ఈ క్రమంలో నిర్మాణ వ్యయం ఏటేటా పెరిగిపోయింది.

● ఎత్తిపోతల అంచనా వ్యయం రు. 704 కోట్లు

సూరమ్మ రిజర్వాయర్‌లో నిరంతరం నీళ్లు నింపాలనే ఉద్దేశ్యంతో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వరద కాలువ నుంచి ఎత్తిపోతల పనులు చేపడతామని ప్రకటించారు. ఈ మేరకు వరద కాలువ ఇంజినీర్లు సర్వేలు చేసి ప్రభుత్వానికి రు. 704 కోట్ల అంచనాలు రూపొందించి నివేదిక పంపించారు. ఆ నిధులకు కూడా మోక్షం లభించలేదు. మండలంలో ఉన్న చెరువులను కూడా నింపేందుకు ప్రణాళిక తయారు చేసినా ప్రభుత్వం నుంచి ఆశించిన ఫలితం రాలేదు. అయితే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మొదటి ప్రాధాన్యంగా సూరమ్మ చెరువును ఎంచుకుని ఇంజినీర్లతో ప్రత్యేకంగా సమీక్షలు చేపడుతున్నారు. మొదటి దశ కింద కట్ట, మత్తడి, రెండో దశలో కుడి, ఎడమ కాలువలు, నష్టపరిహారం చెల్లింపు, మూడో దశ కింద ఎత్తిపోతల పనులుగా విభజించుకుని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రితో నిధులు తెప్పించేందుకు ముమ్మర ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. రాళ్లవాగు ప్రాజెక్ట్ కుడి కాలువ మరమ్మతులపై స్పష్టమైన హామీ ఇస్తున్నారు. తాజాగా ఆదివారం ఇంజినీర్లు సర్వేలు ఆరంభించడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం చోటుచేసుకున్న పరిణామాలు సూరమ్మ, రాళ్లవాగు ప్రాజెక్ట్ పనుల్లో కదలిక రానుందని రైతాంగం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

శ్రీరాముని జెండాల వితరణ



జెండాలను పంపిణీ చేస్తున్న సనాతన ధర్మం యూత్ సభ్యులు

రాయికల్, జనవరి 21: రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో సనాతన ధర్మం యూత్ ఆధ్వర్యంలో రూ.15 వేల విలువ గల జై శ్రీరామ్ జెండాలను గ్రామంలో వితరణ చేశారు. ఈ జెండాలకు స్థానిక హనుమాన్ దేవాలయంలో వేద పండితులు మునుగోటి రమేష్ శర్మ మంత్రోచ్చరణలతో ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సహ కార్యవాహ్ యూత్ సభ్యులు, యువకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కరీంనగర్ విభాగ్ సహ కార్యవాహ్ గోనె భూమయ్య, ఖండ కార్యవాహ్ వేల్పుల స్వామి యాదవ్, భారతీయ కిసాన్ సంఘం అధ్యక్షుడు రావుల లింగారెడ్డి, ఖండ బౌద్ధిక ప్రముఖ్ దొంగ జితేందర్ రెడ్డి, బాలపెల్లి సంజీవ్ రెడ్డి, కోళ్ల రవి, మిట్టపెల్లి రాజరెడ్డి, శివనీతి కిష్టయ్య, సనాతన ధర్మం యూత్ సభ్యులు సంగ రాజేందర్ యాదవ్, గంగారాం యాదవ్ పాల్గొన్నారు.

●మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన యువకులకు అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిపై జైశ్రీరామ్ ముద్రణ వేశారు. అంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటి గోడపైన జైశ్రీరామ్ ప్రింటును ముద్రించారు. ప్రతి ఒక్కరూ ఫోన్‌లో మాట్లాడేవారు హలో అనకుండా జైశ్రీరామ్ అనే మాటను పలకాలని, ప్రతి ఇంటిపై జైశ్రీరామ్ జెండాను ఎగురవేయాలని కోరారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలో ఆదివారం రామ భక్తులు ఇంటింటా తిరుగుతూ శ్రీ రాముని జెండాలను పంపిణీ చేశారు. సోమవారం అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు బాగస్వాములు కావాలని రామభక్తులు కోరారు. మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, మండలంలోని, పూడూర్ మార్కండేయ ఆలయం, కోనాపూర్, తిర్మలాపూర్, తిప్పయ్యపల్లి శివాలయం విద్యుత్ దీపాలతో అలకరణ చేశారు. గ్రామస్తులకు అన్న ప్రసాద వితరణ చేయటానికి గ్రామాల ప్రముఖులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం సీతారామచంద్రుల ఊరేగింపును వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు.

ఇందిరమ్మ కాలనీ సమస్యలు పరిష్కరించాలి



ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తంగళ్లపల్లి, జనవరి 21 : ఇందిరమ్మ కాలనీ వాసులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సీపీఎం నాయకులు కోరారు. శనివారం రాత్రి తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన ముగ్గుల పోటీలో ఆది శ్రీనివాస్‌కు సీపీఎం నాయకుడు కోడం రమణ, కార్మికులు వినతి పత్రాన్ని అందించారు. టెక్స్‌టైల్ పార్కులో యజమానులు వివిధ కారణాలతో తరచూ పరిశ్రమలను బందు చేయడంతో టెక్స్ టైల్ పార్కులో పనిచేస్తున్న పవర్‌లూమ్, అనుబంధ రంగాల కార్మికులు పని లేక చాలా నష్టపోతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. టెక్స్‌టైల్ పార్కులో కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందిరమ్మ కాలనీ గ్రామంలో గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పేదలకు ఇచ్చిన స్థలాలలో చాలామంది స్తోమతలేక ఖాళీగా అసంపూర్తిగా నిర్మాణాలు చేసి వదిలేశారని, సర్వే చేసి అర్హులైన వారందరికీ ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి ప్రాధాన్యం కల్పించాలన్నారు. అదేవిధంగా ఇందిరమ్మ కాలనీలో ప్రస్తుతం ఇల్లు నిర్మించుకొని ఉంటున్న వారికి ఖాళీ ప్లాట్లకు సంబంధించి వివరాలను పూర్తిగా ఆన్‌లైన్ చేయాలని, క్రమబద్ధీకరించి కొత్త పట్టాలను అందించాలని పేర్కొన్నారు. నకిలీ పట్టాలు తయారు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, అక్రమంగా ఏర్పాటు చేసిన ప్లాట్లను స్వాధీనం చేసుకోవాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి కోడం రమణ, టెక్స్‌టైల్ పార్కు వర్కర్స్ యూనియన్‌అధ్యక్షుడు కూచన శంకర్, అక్కల శ్రీనివాస్, ఆడేపు శుభోశేకర్, రాజమల్లు, అంబదాస్, శ్రీనివాస్ టెక్స్‌టైల్ పార్కు కార్మికులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా తిరుపతి

ఇల్లంతకుంట, జనవరి 21 : మండల మున్నూరు కాపు సంఘ అధ్యక్షుడుగా కందికట్కూర్ గ్రామానికి చెందిన యాస తిరుపతి ఎన్నికయ్యాడుజ మండలకేంద్రంలోని సంఘ భవనంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా తిరుపతి మాట్లాడుతూ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సహకారంతో సంఘ అభివృద్ధికి కృషిచేస్తానని, తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి మహా కుంబాభిషేక మహోత్సవం

రాయికల్, జనవరి 21: మండలంలోని ఇటిక్యాల సాయిబాబా దేవాలయంలో సోమవారం నుంచి గురువారం వరకు సాయప్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహా కుంబాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు సాయప్ప ట్రస్ట్ వైస్ చైర్మన్ హిమవంతరావు తెలిపారు. శ్రీ జగద్గురు శంకరాచార్య, హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కోనరావుపేట, జనవరి 21 : కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పిట్టల రమేష్ ఇటీవల మృతి చెందగా స్నేహితులు ఆదివారం బాధిత కుటుంబానికి రూ.33వేలతోపాటు 50 కిలోల బియ్యం అందజేశారు. పిల్లల చదువుకు తమవంతు సాయం అందజేస్తామన్నారు.

గ్రామాల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

ఎల్లారెడ్డిపేట, జనవరి 21: గ్రామాల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గ రాజేశ్వరతండాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రగతి కోసం కేంద్ర సర్కారు ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆయుష్మాన్ భారత్ పథకం కింద ప్రతీ ఒక్కరికి రూ.10 లక్షలు కేటాయిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పీఎం నరేంద్రమోదీ సందేశాన్ని వాహనంపై ఏర్పాటు చేసిన ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. క్యాలెండర్లను ఆ విష్కరించారు. సర్పంచ్ రజితతిరుపతినాయక్, ఉప సర్పంచ్ పద్మమోహన్, వైద్యాధికారి స్రవంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి పాల్గొన్నారు.

ఆలయ ఆవరణను శుభ్రం చేసిన బీజేపీ నాయకులు

సుల్తానాబాద్, జనవరి 21 : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సంద ర్భంగా ఆలయాలను శుభ్రపరచాలన్న బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సుల్తానా బాద్‌లోని హనుమండ్లపల్లి పురాతన హనుమాన్ దేవాలయం ఆవరణను నేతలు శుభ్రం చేసి ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, మండల ఉపాధ్యక్షుడు మెండ శంకరయ్య, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు చిట్టవేని సదయ్య, బీజేవైఎం జిల్లా కార్యదర్శి బుర్ర సతీష్‌గౌడ్, పట్టణ కార్యదర్శులు పోచంపల్లి ఈశ్వర్, కందు నూరి మనోహర్, కూకట్ల అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, జనవరి 21 : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా గ్రామాల్లోని పలు ఆలయాల పరిసరాలను గ్రామస్థులు శుభ్రం చేశా రు. మండలంలోని అందుగులపల్లి హనుమాన్ దేవాలయ ఆవరణ శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కారే శారద-శ్రీనివాస్‌తోపాటు పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం



వెల్లుల్లలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కల్యాణం జరుపుతున్న పురోహితులు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 21 : మండలంలోని వెల్లుల్ల గ్రామా శివారులోని గుట్టపైన గల పురాతనమైన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం నుంచి వేదపండితులు స్వామి వారికి అభిషేకాలు, జయది హోమములు, బలిహరణం, పూర్ణాహుతి, ఎదురుకోలు వంటి తదితర కార్యక్రమాలను ఘనంగా జరిపారు. అనంతరం స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా వేదమంత్రోత్సవాల మధ్య జరిపారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపి ఓడి బియ్యం సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచు గూడూరు రజిని-తిరుపతి, ఎంపీటీసీలు పాక లత-నర్సయ్య, మంచాల శివలు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తొగిటి అంజయ్య, మారు మురళి, అల్లూరి సంజీవ్, లక్ష్మరెడ్డి, గంగారెడ్డి, పురోహితులు నంబి గోపాలకృష్ణశర్మ, హనోహర్‌శర్మ, రాజేంద్రశర్మ, మౌళిశర్మ, కిషన్‌శర్మ, గంగాప్రసాద్, రాజాగౌతమ్‌శర్మ, రాజేశ్వరశర్మ, శివరాంశర్మ, నాయకు లు, సభ్యులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు నగదు అందజేత

మల్లాపూర్, జనవరి, 21 : మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన గడిసందు పెద్దులు గుండె పోటుతో శనివారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు ఆదివారం పెద్దులు మృత దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అంత్యక్రియకలు రూ. 5 అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోకు రాజేందర్, గోల్కొండ ప్రవీణ్‌కుమార్, బుర్రి భీమన్న, మిట్టపల్లి మహేష్‌రెడ్డి, వనతడపుల రమణాచారి, పిట్ల సాయిరాం, రెబ్బస్ సంజీవ్, పాల్గొన్నారు.

నిరుపయోగంగా వైకుంఠదామం



మ్యాడంపల్లిలోని వైకుంఠదామం

మల్యాల, జనవరి 21: మండలంలోని మ్యాడంపల్లిలో నిర్మించిన వైకుం ఠదామం నిరూపయోగంగా మారింది. పనులు పూర్తి అయినప్పటికీ వినియోగించడం లేదు. దీంతో అది వృథాగా మారింది. అధికారులు తగు చర్యలు తీసుకొని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత



బాధితుడికి సెల్‌ఫోన్ అందిస్తున్న సీఐ

బీర్‌పూర్, జనవరి 21: ఇటీవల సెల్ ఫోన్ పోగొట్టుకున్న ఇద్దరు యువకులకు జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్ ఆదివారం బీర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో సెల్ ఫోన్‌లను అప్పగించారు. బాధితులు పులి ప్రేమిత్, సింగం రాజేశం ఇద్దరు తమ సెల్ ఫోన్‌లు పోయాయని బీర్‌పూర్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తులో భాగంగా అత్యాధునిక సాంకేతిక ద్వారా సెల్ ఫోన్‌లు కనిపెట్టి బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గజేందర్, సిబ్బంది ఉన్నారు.

నల్ల పోచమ్మ వద్ద బోరుబావి ఏర్పాటు

కథలాపూర్, జనవరి 21 : మండల కేంద్రంలోని నల్ల పోచమ్మ ఆలయం వద్ద జిల్లా పరిషత్ నిధులతో ఏర్పాటు చేయనున్న బోరుబావి నిర్మాణ పనులను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్దినేని నాగేశ్వర్‌రావు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ నాగం భూమయ్య, సర్పంచ్ కంటె నీరజసత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ మామిడిపల్లి రవి, యాటకార్ల రవి, గంగారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గంగు పాల్గొన్నారు.

పద్మశాలి సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక

రాయికల్, జనవరి 21: మండలంలోని ఇటిక్యాల గ్రామ పద్మశాలి సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా సింగని నవీన్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జాప గంగాధర్, కోశాధికారిగా దాసరి నవీన్, ప్రధాన కార్యదర్శిగా బోగ రాజ్ కుమార్‌తో పాటు సలహా సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నగదు అందజేత

కోరుట్ల, జనవరి 21 : మహాదేవ స్వామి దేవాలయ అభివృద్ధికి రూ. 20,116 నగదును ఆదివారం కమిటీ సభ్యులకు పట్టణానికి చెందిన నీలి శ్రీనివాస్-వినోద దంపతులు అందించారు. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలను నిర్వహించిన నీలి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను ఆశీర్వదించంగా కమిటీ సభ్యులు సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటి సభ్యుడు గెల్లె గంగాధర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన గాంధీ

గంబీరావుపేట, జనవరి 21: ప్రభుత్వ సలహాదారుగా నియామకమైన మాజీ మంత్రి షబ్బీర్ అలీని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కొండూరు గాంధీ ఆదివారం కలిశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖలకు ప్రభుత్వ సలహాదారుగా షబ్బీర్ అలీ నియామకమైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో షబ్బీర్ అలీని కొండూరు గాంధీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట, జనవరి 21: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రేసు శంకర్, ఉపాధ్యక్షుడిగా గడ్డం జితేందర్, ప్రధాన కార్యదర్శిగా మంగురపు అశోక్, కార్యదర్శి, కోశాధికారులుగా గాదం రామదాసు, గుండం శ్రీనివాస్ ఎన్నికయ్యారు.